క్లుప్తంగా

రెగ్యులర్ చేయాలని ఆందోళన

సీతమ్మధార: ఆరేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న తమను రెగ్యులర్ చేయాలంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు డిమాండ్ చేశారు. వారు చేస్తోన్న నిరవధిక సమ్మె నేటికి ఐదో రోజుకు చేరుకుంది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో తమ డిమాండ్లు వినిపిస్తూ నిరసన కొనసాగించారు. ఏడాది కాలంగా పీఎఫ్ కట్ చేయడం నిలిపివేశారని, మార్చి 2022 తర్వాత తమకు రావాల్సిన ఇన్సెంటివ్స్ కూడా నిలిపివేశారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వాతి ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడు పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. ఈ కార్యక్రమంలో పలువురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్: పాతనగరంలోని గీతా భవన్‌లో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. విశ్రాంత ఎస్‌బీఐ ఉన్నతాధికారి శ్రీధర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల బాలికలనుద్దేశించి ఆయన మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. శిబిరాల ద్వారా చక్కటి జ్ఞానం కలుగుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వస్తున్నామని, భగవద్గీత విశిష్టత విద్యార్థులకు వివరించారు. శిక్షణలో యోగా, ధ్యానం, భగవద్గీత ప్రాముఖ్యత తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం. వనజాదేవి వేసవి శిబిరానికి నేతృత్వం వహించగా, కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేజీహెచ్ వైద్యురాలికి గోల్డ్ మెడల్



డాక్టర్ మౌనిషాకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న డాక్టర్ శివానంద్, డాక్టర్ సంధ్యాదేవి

డాబాగార్డెన్స్: కేజీహెచ్ ప్రసూతి వైద్యురాలు.. గైనకాలజీ విభాగంలో ఉత్తమ అవుట్ గోయింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి డాక్టర్ జీపీ మౌనిషాకు ప్రసూతి వైద్యంలో నిష్ణాతురాలైన డాక్టర్ కె. శారదాబాయ్ గోల్డ్ మెడల్ లభించింది. ఈ మేరకు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ శుక్రవారం గోల్డ్ మెడల్ బహూకరించారు. డాక్టర్ మౌనిషా మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనబాబు కుమార్తె. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



పరుగు పందెంలో విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకు క్రీడాపోటీలు దోహదం చేస్తాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే వారితో కథల పుస్తకాలు చదివించారు. నీతి కథలు చదివించి అందులోని నీతిని వివరించారు. అనంతరం వారికి పరుగు పందెం నిర్వహించారు.

సమ్మె నోటీసు అందజేత



భెల్ ఈడీ సుబ్రమణ్యంకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ (ఇంటక్, సిటు) నాయకులు శుక్రవారం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. అందులో భాగంగా జాతీయ సమస్యలతో పాటు భెల్ సమస్యలపై సంస్థ ఈడీ జి. సుబ్రమణ్యంకు సమ్మె నోటీసు ఇచ్చారు. జి.టి.పి. ప్రకాశ్, సీతన్న నాయుడు, ఆర్. జనార్ధనరావు పాల్గొన్నారు.



రామకృష్ణా రైతుమార్కెట్ ఎదురుగా అనధికార వాహనాల పార్కింగ్



పూర్ణామార్కెట్‌లోని ఫ్రూట్‌మార్కెట్ వద్ద..

పార్కింగ్‌తో.. పరేషాన్



స్ప్రింగ్‌రోడ్డులో రాకపోకలకు వీల్లేని రీతిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

- ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత
- వ్యాపారులు, పాదచారుల ఇబ్బందులు
- పద్మవ్యూహాన్ని తలపిస్తున్న రామకృష్ణా రైతుమార్కెట్, ఫ్రూట్‌మార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు ప్రాంతాలు



పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని ప్రధాన మార్కెట్లు, పోర్టుకు వెళ్లే రహదారిలో లెక్కలేనన్ని వాహనాలు పార్కింగ్ చేసి కనిపిస్తాయి. వాటిలో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా ఉంటాయి. అలా పార్కింగ్ చేసినవి అధికారికంగానో.. అనుమతి తీసుకునో చేసినవి కాదు. ఎవరికి నచ్చినట్లు వారు ఇష్టారీతిన పార్కింగ్ చేసిన వాహనాలు. దీనివల్ల పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతు మార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు, పందుపుల్లల సందు వంటి పలు చోట్ల వ్యాపారులు, వాహన చోదకులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావడం, ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిందని పలువురు వాపోతున్నారు.

రామకృష్ణా రైతుమార్కెట్ వద్ద..

రామకృష్ణా రైతుమార్కెట్ వద్ద రహదారికి ఇరువైపులా పార్కింగ్ పేరిట పలువురు రహదారిని ఆక్రమించుకుంటున్నారు. దీని వల్ల మార్కెట్‌కు వచ్చే వివిధ ప్రాంతాల వ్యాపారులు స్థలం లేక రహదారి మధ్యలో వ్యాపారాలు చేసుకుంటున్నారు. గతంలో కూడా ఇదే విధంగా వ్యాపారాలు చేయడం వల్ల ఈ జంక్షన్‌లో ఓ మహిళ లారీ కింద పడి మృతి చెందింది. అంతే కాకుండా అనేక మంది ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

స్ప్రింగ్ రోడ్డులో..

పూర్ణామార్కెట్ వద్ద వన్‌టౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్ల మధ్య ఉన్న స్ప్రింగ్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వినియోగదారులు అంటున్నారు. హోల్‌సేల్ మార్కెట్ కావడంతో ఈ ప్రాంతానికి జనం తాకిడి అధికం. ఇక్కడ ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల వాహనాల సంగతి దేవుడెరుగు.. నడిచి వెళ్లేందుకు కూడా కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

పందుపుల్లల సందు..

పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద ఉన్న ఈ సందు దాటడం ఎవరి తరం కాదంటారు. ఇక్కడ రోడ్డు పైనే వస్త్ర దుకాణలు ఉండడం వల్ల మార్కెట్‌లోకి వెళ్లలేని పరిస్థితి. ఇదిలా ఉంటే మార్కెట్ వెనుక గేటు వద్ద ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేయడం వల్ల మార్కెట్ నుంచి బయటికి వెళ్లలేకపోతున్నామని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ మార్కెట్‌లో ఒక్కొక్క గేటు వద్ద ఒక్కొక్క రకం నిత్యావసరాలు లభ్యం అవుతుంటాయి. అయితే గేటుకు ఎదురుగా పార్కింగ్ చేసే వాహనాల కారణంగా లోపలికి వినియోగదారులు రాలేకపోతున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

7న కన్యకాపరమేశ్వరి జయంతి



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవాలయ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 7వ తేదీన అమ్మవారి 1075వ జయంతి నిర్వహించనున్నట్టు దేవాలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఆ రోజు వేకువజాము 3 గంటలకు సుప్రభాతంతో **మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, అమ్మవారికి** సువర్ణ **వస్త్రాలంకరణ, స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక** పూజా **కార్యక్రమం, 102 మంది మహిళలచే** సామూహిక **కుంకుమ పూజలు, వాసవీ మూల మంత్ర** హోమం **వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో** పాటు **మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన** నిర్వ**హించనున్నట్టు చెప్పారు. అలాగే ఆ రోజు** సాయంత్రం **5 గంటలకు జగదాంబ జంక్షన్** మహారాణి**పేట అంబికాబాగ్ రామాలయం నుంచి** జగదాంబ **జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్,** టౌన్ కొత్త **రోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా కన్యకా**పరమే శ్వరి **ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిం**చనున్నట్టు **చెప్పారు. శోభాయాత్రలో మహిళలు,** పురుషులు ఒకే రకమైన దుస్తులతో 108 రకాల సుగంధ ద్రవ్యాలు, కలశాలతో 108 దీపాలతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, పెనుగొండ చంద్రశేఖర్, దుర్గా సోమేశ్వరరావు, కేఎంవీఎస్‌టీ రామకృష్ణ, పాలూరి సురేష్‌కుమార్, సుగ్గు శివ, కడిమిశెట్టి వెంకట రమణ, పాలూరి ప్రసాద్, గ్రంథి దుర్గాప్రసాద్, కల్లూరి సత్తిబాబు, సంజీవరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ. 500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో శంకరాచార్యుల జయంతి..

జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ వేదపండితులు, అర్చక స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఏఈవో రాజేంద్రకుమార్, పర్యవేక్షకుడు తిరుపతిరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు, అర్చక స్వాములు

నేడు కనకమహాలక్ష్మికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు

అల్లిపురం: కిశోర బాలికలు ప్రతి విషయంలోను అవగాహన కలిగి ఉండేలా ప్రభుత్వం సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం నుంచి ప్రారంభించింది. దీంట్లో భాగంగా కొబ్బరితోట-1,2, యాతపేట సచివాలయాల పరిధిలో, కొబ్బరితోట-5 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.గోవిందమ్మ, సీహెచ్ శ్రీదేవి, బి.ఉమ, కె. పద్మ కిశోరి బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. 11 నుంచి 19 సంవత్సరాల వయసులో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆడపిల్లల రక్షణ కోసం పోక్సో వంటి చట్టాలు ఉన్నాయన్నారు. ఎదిగే వయసులో పోషకాహారం తీసుకోవాలన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, రుతుక్రమ నిర్వహణ, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుభాషిణి, ఆశ వర్కర్లు వి.శ్రీదేవి, పి.నాగలక్ష్మి, అధిక సంఖ్యలో కిశోర బాలికలు పాల్గొన్నారు.

రవీశ్వరరావుకు ఘన సత్కారం



రవీశ్వరరావును సత్కరిస్తున్న రెహ్మాన్, యాదవ ఐక్యవేదిక నాయకులు

డాబాగార్డెన్స్: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన యాదవ సంఘం నాయకుడు గొలగాని రవీశ్వరరావును యాదవ ఐక్యవేదిక శుక్రవారం బీచ్‌రోడ్డు గోకుల్‌పార్క్ వద్ద ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రెహ్మాన్ మాట్లాడుతూ రవీశ్వరరావు కార్యదీక్షాపరుడని, ఏ పనైనా చేయాలనుకుంటే చేయగల సత్తా ఆయనలో ఉందన్నారు. ఒకానొకప్పుడు తాను ఎమ్మెల్యేగా విజయం సాధించానంటే.. ఆ విజయంలో ఆయన పాత్ర ఉందన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అత్తి శంకర్రావు మాట్లాడుతూ రవీశ్వరరావు పదవీ విరమణ సత్కార కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. యాదవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక జాతీయ అధ్యక్షుడు అలిసి అప్పలనారాయణ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గొలగాని రామారావు, పల్లా బాబీ, గొలగాని ప్రసాద్, ఉరుకుటి మురళీ, ముమ్వల ప్రేమ్‌కుమార్, పిన్నింటి ఆదిమూర్తి, ఒమ్మి కనకరాజు, మాజీ కార్పొరేటర్ వెంకటలక్ష్మి, నక్కా సావిత్రి, నక్క పద్మ, బీచ్ వర్తక సంఘం నాయకుడు రమణ, తిరుమలరావు, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ 'కగార్'ను నిలిపివేయాలి

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత వెంకటేశ్వర్లు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల పార్టీల నాయకులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కర్రెగుట్ట నిర్బంధాన్ని తక్షణమే విరమించి, మావోయిస్టుల ఏరివేత పేరుతో ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ నేత ఎం.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాలు, పార్టీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను సమూలంగా నిర్మూలించి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ దమనకాండకు పాల్పడుతోందని ఆరోపించారు. తక్షణమే ఈ నరమేధాన్ని ఆపి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి రాయ్‌పూర్ వరకు ఎనిమిది లైన్ల రహదారులను అందంగా వేస్తున్నది ప్రజల కోసం కాదని, కార్పొరేట్ల కోసమే అన్నారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల సంతోషం కోసం అమాయక గిరిజనులందరినీ అణచివేసి, ఖనిజ సంపదను దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. అందుకనే కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు చేశారని, అలాగే మణిపూర్‌లో చిచ్చు పెట్టి.. ఇప్పుడు కర్రెగుట్టలో మొత్తం సైన్యాన్ని దించారని తెలిపారు. ధర్నాలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సీపీఎం నేత మణి, డీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి కిశోర్, అరుణోదయ నిర్మల, న్యాయవాదులు కె.ఎస్.చలం, సురేష్, ఎంఎస్ఎస్ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

గోపాలపట్నం: నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని బుచ్చిరాజుపాలెం నైట్ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత కుటుంబం చెంతకు చేర్చారు. ఆమె తెలిపిన వివరాలు.. ఎన్ఏడీ పరిసరాల్లో తిరుగుతున్న వృద్ధుడిని మమత తీసుకువచ్చి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. నాలుగు రోజుల తర్వాత వృద్ధుడి వివరాలు సేకరించారు. అతని పేరు పురుషోత్తం ప్రధాన్ అని, తనది రాజమండ్రి దగ్గర కడిపిలంక అని తెలిపాడు. రాజమండ్రిలో ఉన్న కుటుంబ సభ్యులు వివరాలు తెలుసుకుని సమాచారమందించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు వచ్చి వృద్ధుడిని తీసుకు వెళ్లారు. తప్పిపోయిన తమ తండ్రి తిరిగి దొరకడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్



కార్డన్‌సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు



వార్షుభాయి లేన్‌లో స్థానికులను ఆరా తీస్తున్న పోలీసులు



కల్లుపాకలు ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ఎర్రంనాయుడు



వార్షుభాయి లేన్‌లో ఇంటింటిని జల్లెడ పట్టి వివరాలు అడిగితెలుసుకుంటున్న సీఐ జీడీ బాబు

అల్లిపురం: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని విశాఖ టూటౌన్ సీఐ వి.వి.సి.ఎం. ఎర్రంనాయుడు అన్నారు. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వేకువ జాము నుంచి పూర్ణామార్కెట్, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది చుట్టుముట్టడంతో ప్రజలు ఆందోళన చెందారు. పోలీసులు వివరాలు చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. తనిఖీలలో వాహనాలకు నంబర్ ప్లేట్ సరిగా లేని 11 వాహనాలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలు నడిపే వారు అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని, ఈ యాప్ మహిళల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టూటౌన్, మహారాణిపేట, త్రీటౌన్, ఫోర్త్ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతనగరంలో..

డాబాగార్డెన్స్: శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు కేజీహెచ్‌కు ఆనుకుని ఉన్న వార్షుభాయి లేన్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానితులు ఉన్నారా? లేదా ఆరా తీస్తూ.. ఇంటింటిని తనిఖీ చేశారు. వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం సేకరించడం వంటి చర్యలు చేపట్టారు. తనిఖీలో అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉన్న అనుమానితులను గుర్తించడానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తెలిపారు. ఆపరేషన్‌లో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణకు స్టేషన్‌కు తరలించారు. 11 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్‌లో వన్‌టౌన్ సీఐతో పాటు ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మధురవాడకు చెందిన వేదనభట్ల రామ సత్యనారాయణ దంపతులు శుక్రవారం రూ.లక్ష 116 విరాళాన్ని అందజేశారు. దాతకు ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను దాతలకు అందజేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు



కలాసీలను ప్రశ్నిస్తున్న సీఐ ఎర్రంనాయుడు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేస్తున్న సీఐ ఎర్రంనాయుడు తదితరులు

అల్లిపురం: సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు టూటౌన్ పోలీసులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతారావు సిబ్బందితో కలిసి అనుమానిత లగేజీలు, ప్రయాణికులను తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆర్టీసీ లగేజీ కౌంటర్లు, బస్సుల్లో ఎగుమతి అవుతున్న పార్శిళ్లను పరిశీలించారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం(హెచ్‌ఆర్ ఏఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 హోటల్ జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ ఈ సందర్భంగా తెలిపారు. స్టార్ కేటగిరీ హోటల్స్ మేనేజర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. టోర్నీలో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.